సాక్షి
విశాఖపట్నం

బుధవారం | 24 | జూలై | 2024

విశాఖపై ఈసారి కూడా నిర్మలమ్మ కరుణించలేదు. కూటమి ప్రభుత్వ హయాంలో కూడా జిల్లాకు రిక్తహస్తమే చూపించారు. రైల్వే జోన్ ఊసేలేదు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై భరోసా ఇవ్వలేదు. ఎప్పటిలాగే విశాఖ-చెన్నై కారిడార్ జపం చేసినా.. నిధులు మాత్రం విదల్చలేదు. అలాగే నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్, స్టార్టప్ పార్క్‌ల ప్రస్తావనే లేదు. మొత్తంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో సమర్పించిన 2024–25 బడ్జెట్‌లో విశాఖకు ఎప్పటిలాగే నిరాశను మిగిల్చింది. ఎన్డీయే కూటమిలో ప్రధాన మిత్రపక్షంగా చంద్రబాబు ప్రభుత్వం ఉన్నప్పటికీ దీర్ఘకాల విశాఖ ప్రజల ఆకాంక్షలు, ప్రాజెక్టులు, అభివృద్ధి అంశంలో కేంద్రాన్ని ఒప్పించడంతో ఘోరంగా విఫలమయ్యారన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు జిల్లావాసులకు అరచేతిలో స్వర్గాన్ని చూపించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు విశాఖ మొండిచేయి చూపించింది. – విశాఖ సిటీ



ప్రత్యేక హోదా ఏది?



కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో అట్టర్‌ఫ్లాప్ అయ్యారు. ప్రత్యేక హోదా అంశంలో కేంద్రాన్ని ఒప్పించడంలో విఫలమయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కనీసం స్పష్టమైన హామీ ప్రకటన కూడా చేయించుకోలేకపోయారు. కీలకమైన పోలవరం ప్రాజెక్టుకు అందించే సాయం మీదా సీతారామన్ స్పష్టమైన ప్రకటన చేయలేదు.
– వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ

అభివృద్ధికి, ఉపాధికి తోడ్పడని బడ్జెట్



కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశ కలిగించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమిస్తూ ప్రకటన చేయలేదు. ఈ బడ్జెట్‌లో ప్రైవేటీకరణ మరింత తీవ్రమవుతుంది. విశాఖలో ప్రత్యేక రైల్వే జోన్ వంటి ప్రధాన విభజన హామీలను పూర్తిగా విస్మరించారు. అభివృద్ధికి, ఉపాధికి తోడ్పడని బడ్జెట్ ఇది.
– సిహెచ్.నరసింగరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ

అన్నింటా మోసం



బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి చూపించింది. అమరావతికి రూ.15 వేలు కేటాయించినట్లు చెబుతున్నా అది నమ్మశక్యం కాదు. పోలవరం కోసం ఒక్క రూపాయి కేటాయించలేదు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు నిధులు కేటాయించలేదు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గుతామని కానీ సెయిల్‌లో విలీనం చేస్తామని కానీ ప్రకటించకపోవడం దారుణం.
– జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

నిరుత్సాహాన్ని మిగిల్చింది



తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న స్టీల్‌ప్లాంట్ పునరుజ్జీవనం కోసం ప్రకటన చేస్తారని ఎదురు చూసిన రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిరుత్సాహాన్ని మిగిల్చింది. ఎన్నికల ముందు సెయిల్‌లో విలీనం చేస్తామని, సొంత గనులు కేటాయిస్తామని, ఆర్థిక సాయానికి కృషి చేస్తామని చెప్పిన కూటమి నాయకులు కేంద్రంపై తీవ్ర ఒత్తిడి తేవాలి.
– మంత్రి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి, స్టీల్ ఐఎన్‌టీయూసీ

స్టీల్‌ప్లాంట్‌కు తీవ్ర అన్యాయం



బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్‌కు కేటాయింపులు లేకపోవడం అన్యాయం. అమరావతి కోసం రూ. 15 వేల కోట్లు కేటాయించిన కేంద్రం.. స్టీల్‌ప్లాంట్‌కు వడ్డీ లేని రుణం రూ. 8 వేల కోట్లు ఇవ్వకపోవడం దారుణం. స్టీల్ ప్లాంట్‌ను ఆదుకుంటామన్న కూటమి నాయకులు కేంద్ర ప్రభుత్వంపై ఈ అంశంపై ఒత్తిడి తేవాలి.
– డి.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి, స్టీల్ ఏఐటీయూసీ

రైల్వే జోన్ ఊసేలేదు..!



విశాఖ వాసుల దీర్ఘకాల డిమాండ్ ప్రత్యేక రైల్వే జోన్‌కు ఈ సారి కూడా బడ్జెట్‌లో చోటు కల్పించలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో అంశమైనప్పటికీ.. ఇప్పటికీ రైల్వే జోన్‌ను పట్టాలిక్కించే విషయంపై ఎన్డీయే ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్థలం కేటాయించని కారణంగా జోన్ ఏర్పాటు ఆలస్యమవుతోందని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా నిస్సిగ్గుగా అబద్ధాలు వల్లెవేసింది. వాస్తవానికి 2014–2019 మధ్యే రైల్వే జోన్‌కు స్థలాన్ని కేటాయించాల్సి ఉండగా.. అప్పటి టీడీపీ ప్రభుత్వం కనీసం ఆ విషయాన్ని పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముడసర్లోవ ప్రాంతంలో సుమారు 53 ఎకరాలను సేకరించింది. ముందు కొంత స్థలంలో ఆక్రమణలు ఉండగా.. వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించడంతో కొంత జాప్యం జరిగింది. జోన్‌కు అవసరమయ్యే 53 ఎకరాల్లో హద్దులు వేసి మరీ రైల్వే అధికారులకు అప్పగించింది. అయినా రైల్వే జోన్ కోసం నిర్మాణాలు చేపట్టకుండా స్థలం కేటాయించలేదని ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేశాయి. దీనిపై అప్పటి కలెక్టర్ స్థలాన్ని రైల్వే అధికారులకు అందించినట్లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైల్వే జోన్ పనులు ప్రారంభమవుతాయని ఎన్నికల ప్రచారాల్లో ఊదరగొట్టాయి. కానీ అధికారం చెపట్టిన తరువాత కేంద్రం ప్రత్యేక జోన్ విషయాన్ని విస్మరించింది. బడ్జెట్‌లో 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' ప్రస్తావనే చేయలేదు. దీనిపై వామపక్ష పార్టీలు, రైల్వే పరిరక్షణ సంఘం ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే జోన్‌కు స్థలాన్ని కేటాయించినా బడ్జెట్‌లో చోటు కల్పించకపోవడం పట్ల మండిపడుతున్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు విశాఖ రైల్వే స్టేషన్ ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు.

స్టీల్‌ప్లాంట్‌పై భరోసా ఏది?



విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. ఉక్కు పరిశ్రమ మూలధనాన్ని సమీకరించుకునే విషయంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా.. బడ్జెట్‌లో సంస్థ మనుగడకు ఒక్క పైసా కూడా విదల్చలేదు. మూల ధన వ్యయాన్ని అధిగమించేందుకు సొంత గనులు కేటాయించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా కనీసం ఆలోచన చేయలేదు. ఒకవైపు క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్ కోసం పలు మెట్రో నగరాల్లోని పరిశ్రమకు చెందిన నిరర్థక ఆస్తుల విక్రయాలకు ప్లాంట్ యాజమాన్యం సిద్ధమైంది. దీనిపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ఎన్నికలకు ముందు స్టీల్‌ప్లాంట్‌ను అన్ని విధాల ఆదుకుంటామని కూటమి పార్టీలు హామీలు గుప్పించాయి. ప్రధానంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్‌ప్లాంట్‌కు నిధులు సమకూర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామని గొంతులు చించుకున్నారు. అధికారంలోకి వచ్చాక ఆ గొంతులు మూగబోయాయి. నష్టాల ఊబి నుంచి స్టీల్‌ప్లాంట్ బయట పడేందుకు నిధులు కేటాయించాలని ఒక్కసారి కూడా కేంద్రాన్ని అడిగిన పాపాన పోలేదు. మూలధన సమీకరణ, ఉత్పాదక వ్యయం పెరుగుదల వంటి కారణాలు చూపించి ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలన్న ఆలోచనలో భాగంగానే బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఎప్పటిలాగే విశాఖ-చెన్నై కారిడార్ జపం



ఎప్పటిలాగే ఈ బడ్జెట్‌లో కూడా కేంద్రం విశాఖ-చెన్నై కారిడార్ జపం చేసింది. 2014 నుంచి ప్రతి బడ్జెట్‌లోను ఈ కారిడార్ ప్రస్తావన సర్వ సాధారణమైపోయింది. ఈ కారిడార్ ద్వారా పరిశ్రమలు క్యూ కడతాయని ప్రతిసారి విశాఖవాసుల్లో ఆశలు రేకెత్తిస్తూ వస్తున్నారే తప్ప.. ఇప్పటి వరకు పైసా కూడా కేటాయించలేదు. ఈసారి కూడా విశాఖ–చెన్నై కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పినప్పటికీ.. ఎంత కేటాయింపులు చేస్తున్నామన్న విషయాన్ని మాత్రం ప్రకటించలేదు. దీంతో ఈ దఫా కూడా ఎప్పటిలాగే కారిడార్ ప్రకటనతోనే సరిపెడతారా? లేదా నిధులు కేటాయించి కారిడార్‌ను అభివృద్ధి చేస్తారా? అన్నది వేచి చూడాలి మరి.

కూటమి అట్టర్‌ఫ్లాప్



ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నేతల హామీలు కోటలు దాటాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే రైల్వే జోన్ పనులు ప్రారంభించేస్తామని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్రాన్ని ఒప్పిస్తామని, విశాఖ-చెన్నై కారిడార్ అభివృద్ధితో అనేక పెట్టుబడులను తీసుకువస్తామని.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. అడ్డూ అదుపూలేని హామీలతో చంద్రబాబు అండ్ కో విశాఖ ప్రజల నోట్లో బూర్లు వండేశారు. దీంతో అది నిజమని నమ్మిన జిల్లా ప్రజలు కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. కేంద్రాన్ని శాసించే స్థాయిలో అధికారాన్ని కట్టబెట్టినా.. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు మాత్రం ఎన్డీయేకు సాగిల పడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో అంశాలపై గానీ, తెలుగువారి ఆత్మగౌరవంతో ముడిపడిన పరిశ్రమల పరిరక్షణ విషయంలో గానీ వీరు కనీసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంతో విఫలమయ్యారన్న విషయం ఈ బడ్జెట్‌లోనే స్పష్టమవుతోంది.

బల్క్ డ్రగ్ పార్క్ ఎక్కడ?



కేంద్ర బడ్జెట్‌లో నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ ప్రస్తావనే లేదు. అనకాపల్లి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అప్పట్లో కేంద్రం సూచనల మేరకు బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం 5 వేల ఎకరాలను కేటాయించింది. ఇందులో స్టార్టప్ ఏరియా కింద 1100 ఎకరాలను సిద్ధం చేయడంతో పాటు రూ.399 కోట్లు మంజూరు చేసింది. ఇక్కడ భారీ స్థాయిలో ఫార్మా కంపెనీలు ఏర్పాటవుతాయని అందరూ భావించారు. పనులు ప్రారంభించిన సమయంలో 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రైతులకు చెల్లించాలని టీడీపీ నేతలు అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రైతులకు పరిహారాన్ని చెల్లించి పనులు చేపడతామని ఎన్నికలకు ముందు హామీలు గుప్పించారు. అయితే ఈ బడ్జెట్‌లో ఈ పార్క్‌ను పూర్తిగా విస్మరించారు. పారిశ్రామికంగా అనకాపల్లి జిల్లా స్వరూపాన్ని మార్చే అవకాశమున్న ప్రాజెక్టును కనీసం పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు.

ఏపీకి మరోసారి మోసం

తాటిచెట్లపాలెం : బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మరోసారి తీవ్ర అన్యాయం చేసిందని సీపీఐ నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్ తీరును నిరసిస్తూ మంగళవారం రైల్వేస్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించినట్లు చెబుతున్నా అది నమ్మశక్యం కాదని తెలిపారు. పోలవరం కోసం ఒక రూపాయి కేటాయింపు లేదని మండిపడ్డారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఊసే లేదని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా కాపాడుతామని గానీ సెయిల్‌లో విలీనం చేస్తామని గానీ ప్రకటించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాసరావు, నాయకులు జె.డి.నాయుడు, ఎస్.నాగభూషణం, వై.రాంబాబు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

న్యూస్‌రీల్

హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు

గోపాలపట్నం: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం హెచ్చరించారు. సెక్షన్ 129 ప్రకారం ద్విచక్రవాహనాన్ని నడిపినపుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో మొదటి నేరానికి రూ. 1000 జరిమానాతో పాటు 3 నెలలు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 1,162 కేసులు నమోదు చేశామని, తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

27న జెడ్పీ సర్వ సభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 27న ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని సీఈవో ఎం.పోలినాయుడు కోరారు. అన్ని శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు.

ట్రాఫిక్ స్టేషన్లకు ఆర్ఎస్ఐలు

విశాఖ సిటీ: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఇద్దరు ఆర్ఎస్ఐలను ట్రాఫిక్ స్టేషన్లకు తాత్కాలికంగా అటాచ్ చేశారు. ఈ మేరకు ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.విజయ్‌కుమార్‌ను పీఎం పాలెం ట్రాఫిక్‌కు, సిహెచ్.ఉమామహేశ్వరరావును పోర్ట్‌టౌన్‌ను అటాచ్ చేశారు.

సమన్వయంతో విశాఖ అభివృద్ధి





కలెక్టర్ హరేందిర ప్రసాద్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మర్యాద పూర్వకంగా కలిసిన జీవీఎంసీ నూతన కమిషనర్ సంపత్ కుమార్

- విశాఖ నగర మార్పుకు 100 రోజుల ప్రణాళిక
- జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: విశాఖ నగర ప్రజల ఆకాంక్షకు, నగరాభివృద్ధికి అనుగుణంగా తాను పని చేస్తానని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. తన చాంబర్‌లో మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా పనిచేసే అవకాశం తనకు వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకుంటానని చెప్పారు. విశాఖ అందమైన నగరమని, ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పని చేస్తానని చెప్పారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ మిషన్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విశాఖ నగరంలో పర్యటించానని గుర్తు చేశారు. నగరంలో లెగసీ వేస్ట్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ మొదటి ర్యాంకులో నిలిచేలా కృషి చేస్తానన్నారు. గ్రేటర్ విశాఖ సమస్యలు ఒక్కొక్కటి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు.

సిబ్బందిని క్రమ శిక్షణలో నడిపిస్తా..

విశాఖ నగర మార్పుకు 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసుకుని పనులు పూర్తి చేస్తానని, మరీ ముఖ్యంగా ఉద్యోగులు, అధికారులను క్రమశిక్షణలో నడిపిస్తానన్నారు. ప్రతీ నెలలో రెండు, మూడు రోజులు ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించి ఉద్యోగులకు సమయం కేటాయిస్తానని, వారి సమస్యలు వీలైనంత వరకు వెంటనే పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు.

మేయర్‌ను కలిసిన నూతన కమిషనర్

మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని ఆమె చాంబర్‌లో నూతన కమిషనర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వీరిద్దరూ నగరాభివృద్ధిపై కాసే చర్చించారు. నిలిచిన ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని కమిషనర్.. మేయర్‌కు తెలిపారు.

కలెక్టర్‌తో మర్యాదపూర్వక భేటీ

మహారాణిపేట: జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ చాంబర్‌లో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో గరీబ్‌రథ్ రాక



తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్–విశాఖపట్నం గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ కొత్త ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో మంగళవారం ఉదయం విశాఖపట్నం చేరుకుంది. ఇప్పటి వరకు గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ ఐసీఎఫ్ కోచ్‌లతో నడిచింది. అధునాతన సౌకర్యాలున్న ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో మంగళవారం విశాఖపట్నం–సికింద్రాబాద్ బయలుదేరింది.

ఈవీఎంల గొడౌన్‌లో కలెక్టర్ తనిఖీలు

ఆరిలోవ: పాత డెయిరీ ఫారం వద్ద రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎంల గొడౌన్‌లో కలెక్టర్ ఎం.ఎన్.హరేందర్ ప్రసాద్ మంగళవారం తనిఖీలు చేశారు. నెలవారీ తనిఖీలలో భాగంగా పలు రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఆయన ఇక్కడి గోదాములో సీసీ కెమెరాల పని తీరు, భద్రత చర్యలపై ఆరా తీశారు. వీవీ ప్యాడ్లు, తదితర వాటిని పరిశీలించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సెల్ అధికారులు, రూరల్ మండల అధికారులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా విశ్వనాథన్ బాధ్యతలు

విశాఖ సిటీ: విశాఖపట్నం మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ) కమిషనర్‌గా కె.ఎస్.విశ్వనాథన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా సంస్థ జాయింట్ కమిషనర్ రవీంద్ర వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్న విశ్వనాథన్‌ను ప్రభుత్వం ఇటీవలే వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా నియమించింది. మంగళవారం ఛార్జ్ తీసుకున్న విశ్వనాథన్‌ను జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, డీఎఫ్ఓ శాంతి స్వరూప్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, సీయూపీ సంజయ్‌రత్న కుమార్, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం పరిపాలన, అర్బన్ ఫారెస్ట్రీ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా విభాగాల సిబ్బంది వివరాలు, విధి, విధానాలపై ఆరా తీశారు.



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న విశ్వనాథన్

గిరిజనుల మెరుగైన జీవనోపాధికి కృషి

మహారాణిపేట: గిరిజనుల జీవనోపాధి కల్పనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) నూతన వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి అన్నారు. జీసీసీ పురోభివృద్ధికి క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జీసీసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె జీసీసీ తాజా పరిస్థితిపై సమీక్షించారు. విజిలెన్స్, ఫైనాన్స్, మార్కెటింగ్, రిటైల్ మార్కెటింగ్, కాఫీ, పరిపాలన, అకౌంట్స్, రవాణా విభాగాలు, హాట్ అరబికా కాఫీ షాపు, ట్రైఫెడ్ రిటైల్ అవుట్ లెట్ అమ్మకపు కేంద్రాలను పరిశీలించారు. లాసన్స్ బే కాలనీలో జీసీసీ ఖాళీ స్థలాన్ని పరిశీలించి.. కార్యాచరణ కోసం పలు సూచనలు చేశారు. అరకు వ్యాలీ కాఫీ, మార్కెటింగ్, ఇతర అంశాలపై సమీక్షించారు. కల్పనాకుమారి గతంలో విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్–2గా, అనకాపల్లి జిల్లా జేసీగా విధులు నిర్వర్తించారు.



జీసీసీ ఎండీ కల్పనా కుమారి

5 నుంచి డీఎస్సీ ఉచిత శిక్షణ

డాబాగార్డెన్స్: అల్లూరి విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్ సహకారంతో రెండు నెలల పాటు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కోర్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక గంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఎస్టీటీ, ఎస్ఏ సోషల్, తెలుగు అభ్యర్థులకు శిక్షణ ఇస్తామని, అనుభవజ్ఞులతో సైకాలజీ బోధన ఉంటుందన్నారు. ప్రతిరోజూ పరీక్షలు నిర్వహించి, మెటీరియల్ అందజేస్తామన్నారు. ఆగస్టు 5వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, 4న అవగాహన సదస్సు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు 83745 37181, 93472 05549లో సంప్రదించాలని సూచించారు.

మత్స్యశాఖలో కుర్చీలాట

తరచూ జేడీల బదిలీలు


జాయింట్ డైరెక్టర్గా పదవీ బాధ్యతలు చేపట్టిన విజయను అభినందిస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట: మత్స్యశాఖలో కుర్చీలాట సాగుతోంది. ఇక్కడ జేడీగా పనిచేసే అధికారులెవరినీ ఎక్కువ కాలం ఆ సీటులో ఉంచడం లేదు. బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే వారిపై బదిలీ వేటు పడుతోంది. వివరాలివీ.. మత్స్యశాఖలో పని చేస్తున్న అధికారులు తమ పలుకుబడిని ఉపయోగించి జిల్లా జాయింట్ డైరెక్టర్ పోస్టింగ్ తెచ్చుకుంటున్నారు. ఆ తర్వాత బాధ్యతలు స్వీకరించి.. శాఖపై అవగాహన కల్పించుకునే లోపలే వారికి స్థానచలనం అవుతోంది. తాజాగా ఇన్చార్జి జేడీగా ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.విజయకృష్ణను వెనక్కి పంపారు. అతని స్థానంలో విజయను నియమించారు. ఆమె మంగళవారం ఇన్చార్జి జాయింట్ డైరెక్టర్గా పదవీ బాధ్యతలు చేపట్టారు. విజయకృష్ణ ఇదే కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్గా కొనసాగనున్నారు. కాగా.. కాకినాడ జేడీ కార్యాలయంలో పని చేస్తున్న విజయను ఇక్కడ నియమించారు. అక్కడ జీతం, ఇక్కడ విధులు పద్ధతిలో పోస్టింగ్ కల్పించారు.

ఇటీవల కాలంలో మత్స్యశాఖలో జేడీలు తరచూ మారుతున్నారు. గతంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్గా పనిచేసిన పి.లక్ష్మణరావును అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో జి.విజయ జేడీగా బాధ్యతలు స్వీకరించారు. ఆమెను కొద్ది రోజులకే బదిలీ చేశారు. ఆ తర్వాత జాయింట్ డైరెక్టర్ ఎస్.కె.లాల్ మహమ్మద్ను నియమించారు. మత్స్యశాఖ కార్యాలయంలో మహిళా ఉద్యోగితో ఆయన అసభ్యకరంగా ప్రవర్తించడంతో వన్టౌన్ పోలీస్ స్టేషన్లో లైంగిక వేధింపుల కేసు నమోదైంది. దీంతో ఆయన్ని జేడీ బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, గ్రూప్–1 అధికారి ఎం.విజయకృష్ణను ఇన్చార్జి జేడీగా పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా విజయ జాయింట్ డైరెక్టర్గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇక్కడ జేడీగా నియమితులవుతున్న వారికి పూర్తి అదనపు బాధ్యతల (ఎఫ్ఏసీ)తోనే ఉత్తర్వులు వెలువడుతున్నాయి.

ప్రకటనలు కాదు నిధులివ్వాలి


మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

ఎంవీపీకాలనీ: రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన సరే కానీ తక్షణమే నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి తక్షణమే ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. బడ్జెట్లో అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు.

కేంద్ర బడ్జెట్ను స్వాగతిస్తున్నాం

బీచ్రోడ్డు: ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలను సూచించే కేంద్ర బడ్జెట్ను స్వాగతిస్తున్నట్లు ఏపీ చాంబర్స్ జోన్ చైర్మన్ శ్రీనాథ్ చిట్టూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బడ్జెట్లో రాష్ట్ర రాజధాని కోసం రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం, విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులివ్వడం సంతోషంగా ఉందన్నారు. మూల ధన వ్యయంపై దృష్టిపెట్టడం స్వాగతించదగిన అంశమన్నారు.

విద్యావ్యవస్థకు మొండి చేయి


ఏఎస్ నాయుడు

మురళీనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో విద్యా వ్యవస్థకు మొండిచేయి చూపిందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) విశాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏఎస్ నాయుడు ఓ ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్లోని 9 ప్రధాన అంశాల్లో విద్యా వ్యవస్థకు చోటు లేకపోవడం నిరాశ కలిగించిదన్నారు. బడ్జెట్లో విద్యకు కేవలం 3.07 శాతం మాత్రమే నిధులు కేటాయించడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. కొఠారి కమిషన్ సూచనల మేరకు విద్యకు కనీసం 6 శాతం వార్షిక బడ్జెట్లో కేటాయించాలని గతంలో సూచించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ బడ్జెట్లో వేతన జీవులను కూడా నిరాశపరిచినట్లు ఆయన విమర్శించారు. ఆదాయ పన్నులో రాయితీ ఆశాజనకంగా లేదన్నారు. ప్రామాణిక తగ్గింపు రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచి నూతన పన్ను విధానాన్ని ప్రోత్సహించినప్పటికీ.. పాత పన్ను విధానాన్ని కొనసాగిస్తూ స్లాబులను మార్చి అధిక పన్ను చెల్లించే విధంగా చేశారన్నారు. కనీసపు పన్ను మినహాయింపు ఆదాయాన్ని రూ.5 లక్షలు చేయాలన్న వేతన జీవుల ఆశలను నెరవేర్చక పోవడం నిరాశ కలిగించిందన్నారు.

ఇది ఏపీకి ఫ్రెండ్లీ బడ్జెట్

సీఐఐ విశాఖపట్నం చైర్మన్ రాజేష్



మాట్లాడుతున్న సీఐఐ విశాఖపట్నం చైర్మన్ రాజేష్

విశాఖ సిటీ: పార్లమెంట్లోఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం సమర్పించిన కేంద్ర బడ్జెట్ 2024–25 ఏపీ ఫ్రెండ్లీ బడ్జెట్లా ఉందని సీఐఐ విశాఖపట్నం చైర్మన్ గ్రంధి రాజేష్ అన్నారు. పరిశ్రమపై బడ్జెట్ ప్రభావాన్ని చర్చించేందుకు విశాఖలోని ఓ హోటల్లో సీఐఐ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా విస్మరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలకు ఈ బడ్జెట్లో కేటాయింపులు చేయడం అభినందనీయమన్నారు. ముద్ర పథకం కింద రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచడంతో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్లలో పెట్టుబడులు పెరిగే అవకాశాలున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ మాజీ చైర్మన్ నీరజ్ సర్దా మాట్లాడుతూ బడ్జెట్లోనైపుణ్యాభివృద్ధి, పట్టణ మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన, గృహ నిర్మాణ ప్రాజెక్టులపై దృష్టి సారించారన్నారు. సీఐఐ ఏపీ మాజీ చైర్మన్ ఆర్.వి.ఎస్.రుద్రరాజు మాట్లాడుతూ ఈ బడ్జెట్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధి బలోపేతానికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. సీఐఐ విశాఖ మాజీ చైర్మన్ జి.సాంబశివరావు, సాహువాలా సిలిండర్స్ ఈడీ అభిషేక్ గుప్తా, విశాఖ కన్వీనర్లు అనిల్ బెజవాడ, డాక్టర్ ఇ.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: విధుల్లో ఎటువంటి అలసత్వం వహించినా అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం సీపీ కార్యాలయంలో ఉన్న డిపోను సందర్శించారు. అన్ని సెక్షన్లలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. రికార్డులను భద్రపరిచే విధానాన్ని గమనించారు. అన్ని విభాగాల్లో రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు సెక్షన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. డిపో సిబ్బంది వినియోగిస్తున్న టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. సిబ్బందితో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది తెలిపిన కొన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కుటుంబం, ఉద్యోగ పరంగా లేదా ఇతర ఏ సమస్యలు ఉన్నా 7995095799 నెంబరుకు తెలియజేయాలని సూచించారు.

రూ.4.75 కోట్ల వ్యాపారమే లక్ష్యం


మహాజన సభలో మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణంరాజు

సీతమ్మధార: ది మహరాజా కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ 24వ మహాజన సభ మంగళవారం సీతమ్మధారలోని క్షత్రియ కల్యాణమండపంలో నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31, 2024 నాటికి బ్యాంకు రూ.265.96 కోట్లు డిపాజిట్లు, రూ.177.33 కోట్ల రుణాలు ఇచ్చి రూ.443.29 కోట్లు వ్యాపారం చేసినట్టు తెలిపారు. మార్చి 31, 2025 నాటికి రూ.4.75 కోట్లు వ్యాపారమే తమ లక్ష్యమన్నారు. మహాజన సభకు బ్యాంక్ మొట్టమొదటి సభ్యుడు, పూసపాటి అశోక్ గజపతిరాజు సభకు హాజరవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పైడా ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, తెలంగాణా స్టేట్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఫెడరేషన్ అధ్యక్షుడు జి.మదన గోపాలస్వామి, పూర్వ పీఎఫ్ కమిషనర్ ఎస్వీఎస్ఎస్ రామచంద్రరాజు, సంస్థ జనరల్ మేనేజర్ ఎస్.ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

బీహెచ్ సిరీస్ వాహనదారులు పన్నులు చెల్లించాలి

గోపాలపట్నం: బీహెచ్ సిరీస్ వాహనదారులు వెంటనే పన్నులు చెల్లించాలని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో సూచించారు. ఒకే దేశం–ఒకే రిజిస్ట్రేషన్ విధానంలో భారత్ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి ఉన్న వాహనం దేశ వ్యాప్తంగా ఎక్కడైనా తిరగవచ్చనే ఆలోచనలో వాహనదారులు ఉన్నారన్నారు. అయితే బీహెచ్ రిజిస్ట్రేషన్తో పాటు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రం విధించే పన్ను చెల్లించాలని స్పష్టం చేశారు. అలా పన్ను చెల్లించిన వాహనాలకు మాత్రమే ఆ రాష్ట్రంలో తిరిగే హక్కు ఉంటుందన్నారు. బీహెచ్ రిజిస్ట్రేషన్ పొందేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పని చేసే వారు, నాలుగు కంటే ఎక్కువ రాష్ట్రాల్లో బ్రాంచ్లు ఉన్న ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు అర్హులని వెల్లడించారు. కొంత మంది అరుణాచల్ప్రదేశ్ లేదా ఇతర రాష్ట్రాల్లో వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుని.. ఇక్కడ వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇటీవల చేసిన తనిఖీల్లో ఇలా పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న 99 వాహనాలపై కేసులు నమోదు చేసి.. రూ.2.12 కోట్ల పన్ను, రూ.20లక్షల జరిమానా వసూలు చేశామన్నారు. బీహెచ్ సిరీస్ వాహనదారులు వెంటనే ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో పన్నులు చెల్లించాలని సూచించారు. తనిఖీల్లో దొరికితే జరిమానా తప్పదని హెచ్చరించారు.

భూమాత గ్రూప్కు ప్రతిష్టాత్మక అవార్డు


సినీనటుడు సోనూసూద్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సంస్థ ప్రతినిధి

అల్లిపురం: సౌత్ ఇండియాలోనే ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థగా భూమాత గ్రూప్ నిలిచిందని ఆ గ్రూపు అధినేత తాళ్లూరి పూర్ణచంద్రరావు తెలిపారు. అబుదాబిలో జరిగిన ఓ కార్యక్రమంలో భూమాత గ్రూపు అరుదైన గౌరవం సొంతం చేసుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నంబర్ వన్ సంస్థగా తమ సంస్థ అవతరించిందన్నారు. అనేక మంది వినియోగదారుల సొంతిల్లు కల సాకారం చేయడమే ఈ అవార్డు రావడానికి కారణమని ఆయన అన్నారు. ఈ మేరకు ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ చేతుల మీదుగా సంస్థ ప్రతినిధులు అవార్డు స్వీకరించారు.

అక్కాచెల్లెళ్లను వేధిస్తున్న యువకుడు

- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు
- మనస్తాపంతో నిందితుడు ఆత్మహత్యాయత్నం

మద్రిపాలెం: ఇద్దరు మైనర్ బాలికలను(అక్కాచెల్లెళ్లు) వేధిస్తున్న యువకుడిపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ.. కంచరపాలెం వాడపేటకు చెందిన 19 ఏళ్ల రోహిత్ రెడ్డి కంచరపాలేనికి చెందిన అక్కాచెల్లెళ్లను నిత్యం వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వారి తల్లి పుష్పలత సోమవారం రాత్రి ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు రోహిత్పై పోక్సో కేసు నమోదు చేశారు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు తన ద్విచక్రవాహనంపై సోమవారం అర్ధరాత్రి తిమ్మాపురం వెళ్లాడు. అక్కడ తన బైకులో ఉన్న పెట్రోల్ను బాటిల్లో తీసుకుని.. ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఇది గమనించిన కొందరు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతన్ని చికిత్స నిమిత్తం కేజీహెచ్కు తరలించారు. ప్రస్తుతం యువకుడు అక్కడే చికిత్స పొందుతున్నాడు

శారదాపీఠానికి సెక్యూరిటీ నిలుపుదల

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠానికి పోలీస్ రక్షణను ప్రభుత్వం నిలుపుదల చేసింది. పీఠం స్వామీజీల వ్యక్తిగత రక్షణతో పాటు ఎస్కార్ట్, పీఠం రక్షణగా రోజువారీగా ఉన్న దాదాపు 20 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని తొలగించారు. సీపీ ఆదేశాల మేరకు శారదాపీఠానికి సెక్యూరిటీని తొలగించినట్లు పెందుర్తి సీఐ రామకృష్ణ తెలిపారు.

రైతుబజార్లలో టమాటా కిలో రూ.54

మహారాణిపేట: జిల్లాలోని అన్ని రైతుబజారుల్లో బుధవారం నుంచి టమాటా కిలో రూ.54కు విక్రయిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ధరలు అదుపులోకి వచ్చే వరకు ఈ విక్రయాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

28 నుంచి ఆలిండియా ఆన్లైన్ డ్యాన్స్ పోటీలు

మద్దిలపాలెం: స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ విశాఖపట్నం ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 25వ తేదీ వరకు ఆలిండియా ఆన్లైన్ డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఆర్.జానకి ఓ ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న సాంప్రదాయ నృత్య కళాకారుల ప్రతిభను ప్రోత్సహించడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దేశభక్తితో కూడిన బృంద నృత్యాలతో పాటు జానపద, శాస్త్రీయ నృత్యాంశాల్లో డ్యూయెట్లు, గ్రూప్ విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల వారీగా విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలతో పాటు ట్రోఫీలు అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాలకు 85229 90123 ఫోన్ నంబర్లో సంప్రదించాలని జానకి సూచించారు.

ఇగ్నో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు 31 ఆఖరు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాల గడువును పొడిగించినట్లు విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. కేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లోని విద్యార్థులకు ఆన్లైన్ విధానంలో డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. https://ignouadmission.samarth.edu.in/లో అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎంవీపీకాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

విద్యా ప్రమాణాలు పెంపే లక్ష్యం


నూతన కార్యవర్గంతో షిలాయ్జాకీ

కొమ్మాది: దక్షిణ భారతదేశంలో విద్యాప్రమాణాలు పెంపొందించడమే ధ్యేయంగా ఆస్ట్రేలియా మెల్బోర్న్ యూనివర్సిటీ, భారత ప్రభుత్వం, రోటరీ క్లబ్తో కలిసి ముందుకు వెళ్తున్నాయని ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ ఎమ్.ఎస్ షిలాయ్జీకీ అన్నారు. మంగళవారం రుషికొండలో నిర్వహించిన రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ సెంటినియల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో 5 రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఓ ప్రాజెక్టు ద్వారా ఆస్ట్రేలియా మెల్బోర్న్ యూనివర్సిటీ, ఇండియా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఇన్స్టలేషన్ ఆఫీసర్ రవి ద్వారా క్లబ్ ప్రెసిడెంట్గా ఎం.నరేన్, సెక్రెటరీగా దీపక్ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.

నవోదయ విద్యాలయం అభివృద్ధికి సహకారం

- కలెక్టర్ హరేందిర ప్రసాద్ హామీ
- మైగ్రేషన్ విద్యార్థులతో మాటామంతి


నవోదయ విద్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయం అభివృద్ధికి సహకారం అందిస్తామని కలెక్టర్ హరేందిర ప్రసాద్ హామీ ఇచ్చారు. కొమ్మాదిలోని నవోదయ విద్యాలయంలో మంగళవారం మేనేజ్మెంట్ కమిటీ(వీఎంసీ) సమావేశం జరిగింది. విద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ఎస్.చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సంబంధించిన విషయాలను వివరించారు. ఈ సందర్భంగా మైగ్రేషన్ కింద మధ్యప్రదేశ్ రాష్ట్రం గుణ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయం నుంచి వచ్చిన విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. బోధన విషయంలో అక్కడికి, ఇక్కడికి భిన్నంగా ఏమైనా ఉందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడారు.

పారా అథ్లెటిక్ విజేతకు అభినందన

విద్యాలయం విద్యార్థిని తేజస్విని ఇటీవల బెంగళూరులో నిర్వహించిన పారా అథ్లెటిక్ పోటీల్లో లాంగ్ జంప్లో స్వర్ణ పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించింది. ఈ సందర్భంగా తేజస్వినిని కలెక్టర్ అభినందించారు. డీఈవో చంద్రకళ, విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, డీఎంహెచ్వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఫణికుమార్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతం

పెందుర్తి: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే దిశగా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేస్తామని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అన్నారు. జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో విశాఖ జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ స్వయం సహాయక సంఘంలోని సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో రక్షిత తాగునీటి పథకాల మరమ్మతులు, నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన మహిళలను 'నల్ జల్ మిత్ర'లుగా గుర్తించి గ్రామీణ నీటి సరఫరా నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ శిక్షణను ప్రారంభించారు. సమావేశంలో చర్చించిన అంశాలను జిల్లా సమాఖ్య సభ్యులంతా మండల, గ్రామ సంఘాల్లోని సభ్యులకు వివరించాలని సూచించారు. అనంతరం డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ను కలెక్టర్ సందర్శించారు.

రక్షణ గోడ విరిగిపడి ఇద్దరికి గాయాలు


మట్టిలో చిక్కుకున్న కార్మికుడు

మధురవాడ: కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జీవీఎంసీ 5వ వార్డు స్వయంకృషినగర్ కొండవాలు ప్రాంతంలో ఉన్న నివాసాల రక్షణ గోడ, మట్టి చరియలు జారిపోవడంతో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్వయంకృషినగర్ వాటర్ ట్యాంకు సమీపంలోని 3వ వీధిలో రెండు నివాసాల వద్ద మట్టి తడిసిపోయి జారిపోయే స్థితికి చేరుకుంది. దీంతో ఆ నివాసాల యజమానులు సూరిదేముడు, సురేష్ రక్షణ గోడ పునర్నిర్మాణానికి పూనుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నుంచి 8 మంది కార్మికులు గోతులు తవ్వి పిల్లర్లు నిర్మించే పనిలో నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో పైన ఉన్న మట్టి చరియలు ఒక్కసారిగా జారిపోయాయి. దీంతో రోజువారీ కూలి పనుల నిమిత్తం వచ్చిన విశాఖ అప్పుఘర్ ప్రాంతానికి చెందిన గొట్యాడ జమ్మలయ్య (36), మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన నడిపిల్లి శంకర్ (45)పై మట్టి పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు, సహచర కార్మికులు తేరుకుని సహాయక చర్యలు చేపట్టి రక్షించారు. పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో కొండవాలు ప్రాంతాల్లో పనులు నిర్వహిస్తున్నా సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, గ్రేడ్ – 2 వీఆర్వోలు ఏం చేస్తున్నారో తెలియడం లేదని పలువురు అంటున్నారు.

ఫార్మాసిటీ ప్రమాదంలో కార్మికుడి మృతి


కబీరాజ్ సాహు మృతదేహం


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ బాలసూర్యరావు

పరవాడ: పరవాడ జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో స్మైలెక్స్ లేబొరేటరీస్లో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన కాంట్రాక్టు కార్మికుడు కబీరాజ్ సాహు(58) ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదంపై పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన కబీరాజ్సాహు స్మైలెక్స్ పరిశ్రమలో ప్రాసెస్ యూనిట్లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులకు వెళ్లిన కబీరాజ్ సాహు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో చేతులు కడుక్కోవడానికి వెళ్లి అకస్మాత్తుగా వాక్యూమ్ పంపుపై పడిపోయాడు. దీంతో పంపులో తిరుగుతున్న ఫ్యాన్కు చేయి తగిలి తెగిపడి తీవ్ర రక్తస్రావమైంది. పొట్ట భాగంలో కూడా తీవ్ర గాయమైంది. అతడిని చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ప్రమాద స్థలాన్ని పరవాడ డీఎస్పీ పి.సత్యనారాయణ సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పీసీబీ అధికారులు ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

రైల్వేస్టేషన్లో గంజాయి స్వాధీనం


నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితులను గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు...గవర్నమెంట్ రైల్వేపోలీసులు, రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది మంగళవారం రైల్వేస్టేషన్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్కు చెందిన కిశోరి లాల్, వికాస్కుమార్, మధురైకు చెందిన ఆర్.వెంకటేష్ కుమార్లు తమ లగేజీలలో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వీరి నుంచి రూ.71.5వేలు విలువైన 14.3కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసిన రిమాండుకు తరలించినట్టు జీఆర్పీ ఇన్స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు తెలిపారు.

ఎన్ఎస్టీఎల్కు ప్రత్యేక గుర్తింపు


ఎన్ఎస్టీఎల్లో క్యారమ్స్ ఆడుతున్న డైరెక్టర్ అబ్రహం వరుగీస్ తదితరులు

గోపాలపట్నం: డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డవలప్మెంట్లో ఎన్ఎస్టీఎల్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని సంస్థ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ అన్నారు. స్థానిక ఆడిటోరియంలో నేవల్ సైన్స్ అండ్ టెక్నికల్ లేబొరేటరీ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్టీఎల్ 55వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్లో గణనీయంగా కృషి చేశారన్నారు. నీటి అడుగున వినియోగించే ఆయుధాలు, వ్యవస్థలు అభివృద్ధి చేయడంలో విశేష కృషి చేసిన ఉద్యోగులు, శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇలిన్ అబ్రహం లేబ్ రైజింగ్ డే ఉత్సవ కమిటీ సభ్యులు జి.పలాక్షి, వైవీఎస్ చంద్రశేఖర్, పిచ్చయ్య కలపాల, అర్బన్ కుమార్, ఎన్ఎస్టీఎల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు, వర్క్స్ కమిటీ సభ్యులు హెచ్ఎస్ దాస్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్పై సమీక్ష


అమరావతిలో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

డాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్పై మంగళవారం అమరావతిలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సమీక్షించారు. మొదటి ఫేజ్లో పెందుర్తి ప్రాంతం, రెండో ఫేజ్లో గాజువాక, మల్కాపురం ప్రాంతాల్లో యూజీడీ పనులు చేపట్టనున్నారు. మురుగునీటి వ్యవస్థను ఆధునికీకరించడంతో పాటు రీసైక్లింగ్ వాటర్ను హెచ్పీసీఎల్, స్టీల్ప్లాంట్కు ఇచ్చేలా నిర్ణయించారు. రూ.412 కోట్లతో 226 కిలోమీటర్ల మేర మొదటి ప్యాకేజీల్లో పెందుర్తి ప్రాంతంలో యూజీడీ నిర్మాణ పనులు టాటా ప్రాజెక్టు చేపట్టనుంది. సెప్టెంబర్ నెలాఖరుకి ఈ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థకు మంత్రి నారాయణ ఆదేశించారు. కాగా.. పెండింగ్ బిల్లులు త్వరితగతిన విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 26న మరోసారి అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలతో సమావేశం కానున్నారు. వచ్చేవారం విశాఖలో మంత్రి నారాయణ పనులు పరిశీలించనున్నారు. సమీక్ష సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్ యు.రవికృష్ణరాజు, పలువురు ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.